తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
25 అక్టోబర్ 2026
పేజీలు : 08



# కరీంనగర్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలేవీ?

**పాదచారులకు తప్పని రోడ్ల కష్టాలు.. ప్రమాదాల అంచున ప్రజలు**
**మున్సిపల్ అధికారుల మౌనంపై పట్టణవాసుల ఆగ్రహం**









**కరీంనగర్, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
కరీంనగర్ పట్టణంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాదచారులు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లు వ్యాపార కార్యకలాపాలకు వేదికలుగా మారడంతో ప్రజలు రోడ్లపై నడవాల్సిన దుస్థితి నెలకొంది. మార్కెట్ ప్రాంతం, బస్‌స్టాండ్ పరిసరాలు, కోర్టు సర్కిల్, కమాన్ సర్కిల్‌తో పాటు ప్రధాన రహదారులపై ఆక్రమణలతో పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాధనంతో నిర్మించిన నడక మార్గాలను కాపాడాల్సిన అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**రోడ్లపై నడక.. ప్రమాదాల ముప్పు**

ఫుట్‌పాత్‌లపై దుకాణాల సామగ్రి ఏర్పాటు చేయడం, వ్యాపార అవసరాలకు వినియోగించడంతో పాదచారులకు స్థలం లేకుండా పోతోంది. దీంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు రద్దీ రహదారులపై నడవాల్సి వస్తోంది. వేగంగా వెళ్లే వాహనాల మధ్య ప్రమాదాల ముప్పు పొంచి ఉందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు ట్రాఫిక్ రద్దీని కూడా పెంచే అవకాశం ఉన్నందున పాదచారుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

**ఆక్రమణలు తొలగించి.. పర్యవేక్షణ పెంచాలి**

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, అవసరమైన నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగించాలని సూచిస్తున్నారు. తొలగించిన తర్వాత మళ్లీ ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు పాదచారుల హక్కులు, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి? వాటిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ ఏమిటి? అనే అంశాలపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఫుట్‌పాత్‌లు వ్యక్తిగత ఆస్తులు కావని, ప్రజల నడక కోసం ఏర్పాటు చేసిన మార్గాలని గుర్తించి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.




# విద్యార్థులు జీవితాల్లో... బంగారు భవిష్యత్తుకు బాటలు వేయండి

**విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు**

**భిక్కనూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** భిక్కనూరు మండల కేంద్రంలో గల పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,వాటి ఉపయోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మానసికంగా కలిగే అనర్థాలను వివరించారు.చిన్న వయసులోనే చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ,క్రమశిక్షణకు ఆత్మవిశ్వాసం మంచి ఆలోచనలతో విద్యాభ్యాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటు అవడం వల్ల కలిగే అనర్థాలు, జీవితంలో ఎదురయ్యే సమస్యలపై కుటుంబంలో కలిగే ఇబ్బందుల గురించి వారికి క్లుప్తంగా వివరించారు. ఈక్రమంలో విజన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త శరత్ కుమార్, సంస్థ సిబ్బంది సంగీత, మంజుల, పాఠశాల ఉపాధ్యాయురాలు రేఖ, ఉపాధ్యాయులు మాట్లాడుతూ"నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు విద్యార్థులు"మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యం జీవిత లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి, డ్రగ్స్ కు నో చెప్పడం అంటే మన జీవితానికి, కుటుంబానికి, భవిష్యత్తుకు యస్ చెప్పడమే ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉంటూ, తమ స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలి అని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి పాఠశాలలు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.ఈక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విజన్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్జీ-2 ఏరియా ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీల్లో వకీల్పల్లి మైన్ జట్టు విజయం

**యైటింక్లైన్ కాలనీ అక్టోబర్ 24 (జనంసాక్షి) :** సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలు శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. గత రెండు రోజులుగా స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం క్రీడా మైదానంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఏరియాలోని మైన్స్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, ఇతర విభాగాలకు చెందిన మూడు జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో వకీల్పల్లి మైన్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ఓసీపీ-3 జట్టు రన్నరప్‌గా నిలిచింది. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీపడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విజేత జట్టుతో పాటు పాల్గొన్న క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు. ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మహ్మద్ అక్రం, జనరల్ కెప్టెన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి రైతు వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మించాలి

**నీటి సంరక్షణతో పాటు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో విబి జి రామ్ జీ పథకం కింద కొనసాగుతున్న వ్యక్తిగత వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వర్షపు నీటిని చెరువుల్లో నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరగడంతో పాటు పంటలకు సాగునీటి లభ్యత మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. రెండు ఎకరాల భూమిలో చెరువు నిర్మిస్తున్న రైతు సింగిని భిక్షపతిని కలెక్టర్ అభినందించారు. చెరువు పనుల్లో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడిన కలెక్టర్.. పని దినాలు, వేతనాల చెల్లింపులు, పనుల పురోగతి, చెరువు పరిమాణం, లోతు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఇతర రైతులు కూడా క్షేత్ర చెరువుల నిర్మాణానికి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీఏ పీడీ దామోదర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఎంపీడీఓ సవిత రెడ్డి, ఏడీఏ అపర్ణ, గ్రామ సర్పంచ్ సాయాగౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

### హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**వీణవంక అక్టోబర్ 24( జనం సాక్షి)** వీణవంక మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఉడుత సునీల్ ఇటీవల మృతి చెందగా మృతుని కుటుంబానికి శనివారం రోజున హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వారి వెంట మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ మాడురు విజయ భాస్కర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ కామిడీ శ్రీనివాసరెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దపల్లి మహిపాల్ రెడ్డి, మనోహర్,తోపాటు తదితరులు ఉన్నారు.

## పేద విద్యార్థుల కోసం కంప్యూటర్ అందజేత



**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 24 (జనంసాక్షి) :**పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించేందుకు ఆధార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రానికి డాక్టర్ ప్రశాంత్ అభిలాష నర్సింగ్ హోం తరపున ఒక కంప్యూటర్‌ను అందించారు. ఈ కంప్యూటర్‌ను సంస్థ అధ్యక్షులు కంసాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముల్కల గంగారం స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ, తాను చిన్నతనంలో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని, పేద విద్యార్థులకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, దీనివల్ల విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన ఆధార్ సంస్థను అభినందించారు.

## త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలి

### రైస్ మిల్లర్లకు పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ఆదేశం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఅక్టోబర్ 24 (జనంసాక్షి)**ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలు, సరఫరా ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రైస్ మిల్లర్లతో బియ్యం సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం సరఫరా పురోగతిని సమీక్షించి, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేసి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒక్కరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 24 ( జనంసాక్షి ) :**ఎస్.ఆర్.ఆర్ బ్యాంక్వెట్ హాల్ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌, ఢీకొట్టిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్ శ్రీహరినగర్ వాసి అయిన రామిడి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆమె కుమారులు రామిడి ప్రణయ్ కుమార్ (26), రామిడి వినయ్ కుమార్ (24) ఇద్దరూ కలిసి తేదీ 23 రోజున నుస్తులాపూర్ గ్రామంలోని ఒక ఫంక్షన్‌కు తమ టీవీఎస్ అపచి బైక్ (టీస్ 09 ఫ్ పి 7527) పై వెళ్లారు. తిరిగి వస్తుండగా, శనివారం తెల్లవారుజామున 02:00 గంటల ప్రాంతంలో కరీంనగర్ బైపాస్ రోడ్డులోని ఎస్ ఆర్ ఆర్ బ్యాంక్వెట్ హాల్ వద్దకు చేరుకోగానే, అకస్మాత్తుగా ఒక కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ మరియు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రణయ్ కుమార్‌కు తల, శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ప్రణయ్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## జనగామలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలి

### రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, జనంసాక్షి :**ప్రభావిత ప్రాంతమైన జనగామలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి అధికారులు దృష్టి సారించాలని రామగుండం నగర మేయర్ అన్నారు. బోర్ వెల్ కుంగిపోయిన నేపథ్యంలో మున్సిపల్, సింగరేణి అధికారులతో కలిసి శనివారం ఆయన జనగామ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సింగరేణి బొగ్గు గనుల తవ్వకాల వలన తమ గ్రామంపై పడుతున్న ప్రభావాన్ని , తమకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. తమ గ్రామంలో భూగర్భ జలాలు క్షీణించి పోవడంతో పాటు అడపా తడపా భూమి కుంగుపాట్లు జరుగుతుండడంతో గోడలు బీటలు వారి ఇండ్లు ఎక్కడ కూలిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములను తీసుకొని బొగ్గు గనుల తవ్వకాలను ప్రారంభించిన సింగరేణి తమ గ్రామాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ బావులు ఎండిపోయాయని , సింగరేణి సంస్థ నల్లాల ద్వారా మంచి నీటి సరఫరా కూడా నిలిపివేయడం తో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని అన్నారు. కుంగిపోయిన బోర్ వెల్ ను పరిశీలించి, గ్రామస్తుల సమస్యలను సావధానంగా విన్న అనంతరం మేయర్ మీడియాతో మాట్లాడారు. బోర్ వెల్ కుంగిపోయిన సమాచారం తెలిసిన వెంటనే తగు చర్యలు తీసుకోవాలసిందిగా రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ జారీ చేసిన ఆదేశాల మేరకు తాను సింగరేణి అధికారులతో పాటు ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగిందని అన్నారు. బోర్ వెల్ ఎలా కుంగిపోయిందనే విషయంలో సాంకేతిక నిపుణులచే పూర్తి స్థాయిలో విచారణ చేసి నిర్ధారించిన తదుపరి తదనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టాలని సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జనగామ గ్రామం సింగరేణి వన్ ఇంక్ లైన్ బొగ్గు గని మీదనే ఉండడం వలన స్టవింగ్ లోపంతో ఇలాంటి సంఘటన జరిగినట్లుగా ప్రాథమిక అంచనా కు వచ్చామని అన్నారు. కుంగిపోయిన బోర్ వెల్ ను 24 గంటల్లోగా పునరుద్ధరించడంతో పాటు గ్రామంలో చెడిపోయిన అన్ని బోర్ వెల్ లను మరమ్మత్తు చేయించాలని సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే నిలిపివేసిన సింగరేణి నల్లా ల ద్వారా నీటి సరఫరా కూడా పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సింగరేణి వన్ ఇంక్ లైన్ బొగ్గు గని పూర్తిగా జనగామ గ్రామం కిందనే ఉన్న నేపథ్యంలో స్టవ్వింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో పాటు జియాలాజికల్ , ఎన్విరాన్మెంటల్ నిపుణులతో గ్రామమంతా సర్వే చేసి కుంగు బాటు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే గ్రామానికి అవసరమైన రోడ్లు , కాలువలు , వీధి దీపాలు , సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని అలాగే చెడిపోయిన వాటిని మరమ్మత్తు చేయించాలని సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జనగామ గ్రామ సంక్షేమం , అభివృద్ధి విషయంలో గతంలో అధికారంలో లేకపోయినా సింగరేణి పై అనేక పోరాటాలు చేశామని , ఇప్పుడు కూడా గ్రామస్తుల వెంటే ఉంటామని మేయర్ అన్నారు. గ్రామ సమస్యల పరిష్కార, విషయం చర్చించడానికి ఎం ఎల్ఎ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జి ఎం తో పాటు సంబంధిత అధికారులందరితో నగర పాలక సంస్థ కార్యాలయంలో సమావేశం, ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా సింగరేణి జి ఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ రామగుండం ఎం ఎల్ ఎ , మేయర్ ఆదేశాలమేరకు స్థానిక కార్పొరేటర్ , గ్రామస్తులు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. బోర్ వెల్ కుంగుబాటు నేపథ్యంలో జనగామ గ్రామం పై ప్రభావం పై సింగరేణి జియాలజికల్ , సర్వే , ఎన్విరాన్ మెంటల్ నిపుణుల బృందం లోతుగా పరిశీలన చేస్తుందని అన్నారు. కుంగిపోయిన బోర్ వెల్ తో పాటు ఇతర బోర్ బావులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయడంతో పాటు నల్లాల ద్వారా నీటి సరఫరా కూడా పునరుద్ధరించడం జరుగుతుందని అన్నారు. జనగామ గ్రామస్తులు ఎలాంటి ఆందోళన చెందవల్సిన అవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లు దాసరి సాంబ మూర్తి , గట్ల రమేష్ , సింగరేణి ఎస్ ఓ టు జి ఎం చంద్ర శేఖర్ , ఏజెంట్ రమేష్ బాబు , డి జి ఎం ఎక్స్ ప్లోరేషన్ రమేష్ బాబు, డి జి ఎం వర ప్రసాద్ , ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్ స్థానిక నాయకులు తోకల రమేష్ , విజయ్ , సింగరేణి శ్రీనివాస్ , కృపాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కమ్మర్పల్లి ఎస్ఐ సిహెచ్.సతీష్



**కమ్మర్పల్లి అక్టోబర్ 24(జనంసాక్షి)** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కమ్మర్పల్లి ఎస్సై సిహెచ్.సతీష్ సూచించారు.మండలంలోని నాగపూర్ గ్రామంలో శుక్రవారం రోజున నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించి గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వివిధ సామాజిక అంశాలపై ఎస్సై. సతీష్ ప్రజలకు అవగాహన కల్పించారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని నెంబర్లనుండి ఫోన్ చేసి ఓటిపి చెప్పమని అడిగినప్పుడు అప్రమత్తతో ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని అన్నారు.యువకులతో ప్రత్యేక సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితలు నాశనం అవుతాయని కుటుంబాలు చిన్నవిన్నామవుతాయని తెలిపారు.మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు తమ విధిగా ప్రతి ఒక్కరూ పాటిస్తూ సహచర ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం కొనసాగించాలి. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైకు నడపాలి కారులో వెళుతున్నప్పుడు సీట్ బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలని కోరారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వారికి ప్రజలు యువత ప్రజలు అన్ని విధాల సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పాలేపు నర్సయ్య,గ్రామ సర్పంచ్ కప్పదండి అశోక్ ఉపసర్పంచ్ విడిసి అధ్యక్షులు వార్డ్ సభ్యులు గ్రామ కార్యదర్శి యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయి బొగ్గు రవాణా చేసిన ఓసి.5..




**గోదావరిఖని, జనంసాక్షి :**జిడికె ఓసి-5 సరికొత్త రికార్డు – ఒకే రోజు 13,681 టన్నుల బొగ్గు డిస్పాచ్ రామగుండం ఏరియా -1 పరిధిలోని జిడికె ఓసి-5 గని బొగ్గు డిస్పాచ్ లో సరికొత్త రికార్డు సృష్టించింది. శుక్రవారం (23.10..2026) రోజున 9666 టన్నుల లక్ష్యానికి గాను, 13,681 టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసి లక్ష్యాన్ని సాధించింది. ఈ ఘనత సాధించిన, ప్రాజెక్ట్ ఆఫీసర్ డి రమేష్, స్టాటర్ మేనేజర్ రమేష్ బాబు, యాక్టింగ్ మేనేజర్ గంధం రాములు, ఏఐటియుసి ఫిట్ సెక్రెటరీ గుర్రం ప్రభుదాస్, సూపర్ వైజర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ సిబ్బంది యూనియన్ నాయకులను అధికారులను ఆర్.జి-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో అన్ని గనులు కూడా పనిచేసి వార్షిక లక్ష్యాలను సాధించాలని జిఎం పిలుపునిచ్చారు.

## రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి

### ఐఎస్ఆర్‌డీ కార్యదర్శి అమృత రాజేందర్



**సదాశివనగర్ అక్టోబర్ 24 జనంసాక్షి :**పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డిలో జిల్లా పోలీస్ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అమృత రాజేందర్ మాట్లాడుతూ, ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒక యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడి, వారికి కొత్త జీవితాన్ని అందించగలదని పేర్కొన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని కోరారు.

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

### నిబంధనల అమలుపై నిశిత పరిశీలన



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:** జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం అసిస్టెంట్ సైంటిస్టు (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) పోస్టుల భర్తీ కోసం సీ.బీ.టీ విధానంలో ఎగ్జామ్ నిర్వహించగా,పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ. కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అన్నది గమనించారు. బయో-మెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్ కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద చేసిన ఏర్పాట్లను, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ప్రధాన ప్రవేశ మార్గం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. పరీక్షా కేంద్రంలోని ఆయా గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని అన్నారు. ఈ నెల 26న జరుగనున్న పరీక్షలను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీ.ఐ.ఈ.ఓ రవికుమార్ తదితరులు ఉన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

### ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:** జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం లోటు ఏర్పడి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరించనుండగా, జిల్లా వ్యవసాయ అధికారిని మెంబర్ కన్వీనర్‌గా, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కమిటీ సభ్యులుగా ఉన్నారు. కరువు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, కరువు నివారణ ప్రణాళిక అమలు తీరును నిశితంగా పరిశీలించడం తదితర బాధ్యతలను ఈ కమిటీ నిర్వర్తిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.



వర్షపాతం లోటు, భూగర్భ జలాల స్థితిగతులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను ప్రతి వారం సమీక్షించడం,ప్రభావిత గ్రామాలను సందర్శించి పరిస్థితులను అంచనా వేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం,సంబంధిత శాఖల ద్వారా కరువు నివారణ చర్యల అమలును పర్యవేక్షించడం,పంటల వైవిధ్యీకరణ, తాగునీటి సరఫరా, పశువులకు దాణా, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలపై జిల్లా స్థాయి కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని అన్నారు. కరువు ప్రభావం నెలకొనేందుకు అవకాశం ఉన్న మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి తక్షణ నివారణ చర్యలు చేపట్టడం, వాస్తవ పరిస్థితులపై రోజువారీ నివేదికలను సమర్పిస్తుందని, తద్వారా అవసరమైన సమాచారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం



### •పీఎం రాహత్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి
### •రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:** రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో పీఎం రాహత్ పథకం కీలకంగా నిలుస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం అమలుపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సీ.ఎస్ సంజయ్ జాజు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాదితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారదర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు పలు సూచనలు చేశారు. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని అన్నారు. నగదు, బాదితుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వైద్యసేవలు నిరాకరించకూడదన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి ప్రమాదాల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు రాజాగౌడ్, భుజంగరావు, జిల్లా రవాణా శాఖ అధికారి రమేష్ రాథోడ్, వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈ-దార్ జిల్లా మేనేజర్ వర్ష నిహంత్ తదితరులు పాల్గొన్నారు.

## పిప్రిలో పుప్పాల పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ షేక్ షఫీ



**భీంగల్ అక్టోబర్ 24 జనం సాక్షి:** భీంగల్ మండలం పిప్రి గ్రామానికి చెందిన పుప్పాల పెంటయ్య భార్య ఇటీవల మృతి చెందడంతో, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఫౌండర్ డాక్టర్ షేక్ షఫీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శిం చారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఈ విషాద సమయంలో వారు మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నంబుల గిరి, జిల్లా ట్రెజరర్ జువ్వి హరీష్, మోర్తాడ్ అధ్యక్షులు నాగేష్, జిల్లా అడ్వైజర్ శేఖర్, రిజ్వాన్, సుదర్శన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నామాపూర్‌లో జిల్లాలోనే తొలి ఐకేపీ కేంద్రం ప్రారంభం



**ముస్తాబాద్ అక్టోబర్ 24 జనం సాక్షి::** జిల్లాలోనే తొలి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో గ్రామ సర్పంచ్ మాదాసు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గజ్జెల రాజు మాట్లాడుతూ. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర అందిస్తుందని, దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. కేంద్రంలో తూకం, గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూస్తామని సర్పంచ్ మాదాసు అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి ఫారుక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల బాల్ రెడ్డి, ఉపసర్పంచ్ కుమార్, ఏపిఎం రాజనర్సు, శోభన్ బాబు, సిఏ, సీసీలు మహిళా సంఘం అధ్యక్షులు, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఐకేపీ సిబ్బంది, నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవముల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

### పోలీస్ కమిషనర్ వెల్లడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:** నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మెరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవములలో భాగంగా (పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ) నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలలోని కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు పోలీస్ అమరవీరుల దినోత్సవము సందర్భంగా " వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 వరకు నిర్వహించడం జరిగింది. అంశము : ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు. ఎస్.ఐ నుండి ఆ పై స్థాయి వరకు పోలీస్ అమరవీరుల దినోత్సవము సందర్భంగా " వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించడం జరిగింది. అంశము : పౌరుల మందనలు పొందడానికి పోలీసులు చేయవలసిన కృషి ఏమిటి అనే అంశాల పైన పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

# గంజాయి చాక్లెట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాలి
- తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్ పటేల్





**కరీంనగర్ ,క్రైమ్ అక్టోబర్ 24 ( జనంసాక్షి ) :** డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, గంజాయి చాక్లెట్ల పేరుతో మత్తు పదార్థాలు అందుబాటులోకి వస్తున్నాయనే సమాచారంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, డీటీఎఫ్ కరీంనగర్‌కు చెందిన పసుల రవికుమార్ పటేల్ సూచించారు.పిల్లలు ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలనే ఆశతో తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడుతున్నారని తెలిపారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం భూములు, ఆస్తులు అమ్మి, అప్పులు చేసి మరీ చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత గుర్తుంచుకోవాలని కోరారు.మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చెడు స్నేహాలు, ఇతరుల ప్రలోభాలకు లోనై గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని యువతకు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబ సభ్యుల ఆనందాన్ని, ప్రశాంతతను కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై శ్రద్ధ వహించాలని సూచించారు. అనుమానాస్పదంగా కనిపించే చాక్లెట్లు లేదా ఇతర పదార్థాలను పిల్లలు తీసుకోకుండా జాగ్రత్తలు చెప్పాలని కోరారు.గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా వాటి సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసినవారు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాల నిర్మూలనకు యువత, తల్లిదండ్రులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు."యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయాలి. తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకొని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుకోవాలి. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి అని పసుల రవికుమార్ పటేల్ కోరారు.

## రుద్రంగిలో ఓపెన్ హౌస్ కార్యక్రమం



**రుద్రంగి అక్టోబర్ 24 (జనం సాక్షి)**పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రుద్రంగి పోలీస్ స్టేషన్ లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రుద్రంగి ఎస్ఐ రవీందర్ విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించారు. నేరాల దర్యాప్తులో ఫింగర్ ప్రింట్ పరికరాల వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు.అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు సూచించారు. నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

## కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పౌర సరఫరాల శాఖ డైరెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 (జనం సాక్షి)**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. అనంతరం కొద్దిసేపు జిల్లాలో పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

## రాజరాజేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు

**భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలపై కీలక సూచనలు**



**జనం సాక్షి ఎల్లారెడ్డి అక్టోబర్ 24 ఎల్లారెడ్డి:** శ్రీ రాజరాజేశ్వర ట్రేడర్స్ సిమెంట్ సలాక యజమాన్యం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో యజమాన్యం మాట్లాడుతూ.. సిమెంటు రకాలు, సలాక దృఢత్వం గురించి వివరించారు. భవన నిర్మాణంలో గోడ నిర్మాణం, కాంక్రీట్, స్లాబ్, ఇల్లు నిర్మాణం కోసం ఏ రకాల సిమెంట్, సలాక వాడాలనే అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో యజమాన్యం సురేష్, వినోద్ రెడ్డి, విగ్నేశ్వర్, కార్మిక సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు మహా మేస్త్రీ మర్రు సాయిబాబు, మండల ఉపాధ్యక్షులు పెద్ద బాలి సాయిలు, కోశాధికారి దుర్గా సింగ్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరీం, కార్యదర్శి గణేష్, సీనియర్ నాయకులు అవిటి బాబు, శ్యామ్, ప్రచార కార్యదర్శి కాంతారావు చందు, సలహాదారులు పోచయ్య, శివాజీ, సత్యనారాయణ, ప్రతాప్, రామ్మోహన్ రావు, బాలయ్య సాయిలు, రాజు, హనుమంతు మరియు మండలంలోని వివిధ గ్రామాల ముఖ్య కార్మిక నాయకులు, అత్యధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటికి ఘన సన్మానం

**శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీడీవో, తహసీల్దార్, సర్పంచులు**



**గంభీరావుపేట, అక్టోబర్ 24 జనం సాక్షి:**మండల సర్వసభ్య సమావేశం అనంతరం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వేషాల వెంకటిని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మండల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ మారుతి రెడ్డి, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వేషాల వెంకటికి శాలువా కప్పి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఆయనకుఅభినందనలుతెలియజేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సన్మానకార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## వైనాల రాజును పరామర్శించిన డిసిసి ప్రధాన కార్యదర్శి



**కమాన్ పూర్ అక్టోబర్ 24, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు, వారి సోదరుడు వైనాల వినోద్ ను, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య సమ్మయ్య, టీపీసీసీ రాష్ట్ర నాయకులు వాసు, ఆదివరాహ దేవస్థానం డైరెక్టర్ శ్రీనివాసరావు తో పాటు కమాన్ పూర్ బీజేపీ నాయకులు మచ్చగిరి రాము జంగపల్లి అజయ్ మట్ట శంకర్, పెద్దపెల్లి శ్యామ్ మల్లారపు అరుణ్, దాసు, రాజేందర్ తదితరులు తదితరులు శనివారం పరామర్శించారు. గడిచిన బుధవారం వైనాల రాజు తండ్రి వైనాల సాంబయ్య మృతిచెందగా సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సాంబయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు.

## మానవత్వం చాటిన గంగాపురి బీఆర్ఎస్ నాయకులు



**మంథని, అక్టోబర్ 24, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు గంగాపురికి చెందిన బొద్దుల మల్లయ్య అకాల మరణం బాధాకరమని గంగాపురి బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మల్లయ్య తొమ్మిదో రోజు కార్యక్రమం సందర్భంగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి, కుమారుడు బొద్దుల రాజుకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగించిన మల్లయ్య అందరితో ఆప్యాయంగా మెలుగుతూ, ప్రేమాభిమానాలతో పలకరించేవారని గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకే కాకుండా, ఆయనతో అనుబంధం ఉన్న వారందరికీ తీరని లోటని పేర్కొన్నారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని ఈ సందర్భంగా వారు చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో బడికెల శ్రీనివాస్, ఆడిచర్ల సమ్మయ్య, సామల రమేష్, గడిపెల్లి శ్రీనివాస్, దూదపాక లింగయ్య, పుల్లె కృష్ణ, ఏగోలపు చిన్న సమ్మయ్య, ఎరుకల మనోహర్, కొండ లక్ష్మణ్, జంజర్ల సతీష్, కొండ వెంకటేష్, బుర్ర వెంకటేష్,తాటి రమేష్ గౌడ్, తదితర బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్లకు రీ ఓరియంటేషన్ శిక్షణ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లోని కీటక జనిత వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లకు మైక్రోస్కోపీ ద్వారా రక్త పూతల నమూనాలను పరీక్ష చేసే విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పీ హెచ్ సి లోని ల్యాబ్ టెక్నీషియన్ లకు రక్తపూతల నమూనాలను తీసే టార్గెట్ ను యాక్టివ్ 10% కాగా, ప్యాసివ్ 15% తీయాలన్నారు. మలేరియా నిర్ధారణ కోసం తీసిన రక్త పూతలను జేఎస్బి 1 2 ద్వారా స్టైనింగ్ చేయాలని, నెలవారి రిపోర్టులను క్రమం తప్పకుండా డి ఎం ఓ కార్యాలయానికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొదక్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అజ్మల్, డీఎస్ఓ డాక్టర్ వెంకటేష్, ఏ ఎమ్ ఓ సలీం, సబ్ యూనిట్ అధికారులు, వివిధ పిఎస్సీల ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

## వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయాలి

**కుమార్ సింగ్**

**పెద్ద కొడప్గల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర భారతీయ కిసాన్ సంఘం పెద్ద కొడప్గల్ అధ్యక్షుడు కుమార్ సింగ్ డిమాండ్ చేశారు. దీనికై ఈ నెల 26వ తేదీన సోమవారం "చలో తహశీల్దార్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## రసా భసగా మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశము



**ముస్తాబాద్ అక్టోబర్ 24 (జనం సాక్షి)**ముస్తాబాద్ ఎంపిడిఓ లచ్చాలు ఆధ్వర్యములో మండలస్థాయి అధికారుల సమీక్ష సమావేశాన్ని ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి నిర్మల మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే రోజుల్లో ఎల్నినా ప్రభావం వలన తీవ్ర కరువు ఏర్పడేపరిస్థితివుందని,ఆరుతడి ,పంటలను వేయాలని సూచించగా,సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు చిగురు నరేష్ మాట్లాడుతూ అధికారులు సరైన క్రమములో విధులు నిర్వహిస్తే నీళ్ళు రావా? పంటలు పండవా? అనీ ప్రశ్నించారు. అధికారులు,నాయకులు అనుకుంటే రైతులను రాజు లను చెయ్యవచ్చని అని తెలిపారు.వరి పంటలు వద్దని రైతులకు అధికారులు చెబుతున్నారు కానీ,ఒక సంవత్సరం పాటు రైతులు అనుకొని పంటలు వేయకపోతే ప్రభుత్వాలు,రాష్ట్రాలు,దేశాలు అగమైపోతాయని అన్నారు.రెండు నెలలు టమాటా,నాలుగు నెలలు మిర్చి పండిశీచకపోతే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందనీ వివరించారు.ఇప్పటికీ సర్పంచులు ఆయా గ్రామాల్లో వున్నప్పటికీ అధికారులు సరైన విధులు నిర్వహించక గ్రామాల్లో,నీటి,కరెంట్ విషయములో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని పేర్కొన్నారు .మండలములో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ప్రత్యేక అధికారి నిర్మల ను కోరారు, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానని సమాధానం చెప్పారు, తెలియజేస్తామని తీర్మానపత్రాన్నిఅందజేశారు.ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయములో సర్పంచులకు ప్రత్యేక అధికారాం కల్పించాలని కొండాపూర్ సర్పంచ్ మహిపాల్ అన్నారు.ఇప్పటికీ మండల స్థాయి సమావేశాలు నిర్వహించిన అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయిలో పాల్గొనక,గ్రామాల్లో విధులు నిర్వహించక పోవడం పై ఆయా గ్రామాల సర్పంచులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారి నిర్మలను వివరణ కోరగా జనరల్ బాడీ సమావేశానికి జిల్లా స్థాయి మండల స్థాయి అధికారులు రాలేకపోవడం వలన సర్పంచులకు కొంత ఇబ్బందికరంగానే ఉన్నది ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తారని అన్నారు.

# ఆలయా నిర్మాణానికి50 వేల విరాళం



**లింగంపేట్ అక్టోబర్ 24(జనం సాక్షి)**లింగంపేట మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయ నిర్మాణానికి టిఆర్ఎస్ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ 50వేల వివరాలు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు .లింగంపేట్ మండల కేంద్రంలోని ఆదిపరాశక్తి ముత్యాల పోచమ్మ అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది దాతల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టడానికి ఆలయ కమిటీ సభ్యులు ముందుకు వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు టిఆర్ఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ సంపత్ గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించిఆలయం నిర్మాణం కోసం 50000 యాభై వేల రూపాయలు విరాళం అందించారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన భరోసించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోకల సాయిరాం.జిల్లా యూత్ అధ్యక్షుడు దేగావత్ జైల్ సింగ్.జిల్లా (కాయితీ లాభాన్) అధ్యక్షుడు నానక్ సింగ్.పాండు.ఐలాపూర్ ఉపాధ్యక్షులు సాయిలు.చెన్నం ఉషయ్య. చెన్నం స్వామి.నరేష్. రవి.మల్లేష్ కిషన్.చేన్నం సాయిలు.అశోక్ పాల్గొన్నారు.

# రక్త దాతకు సిఐ ఎస్ఐ చేతుల మీదుగా ప్రశంస పత్రం




**లింగం పేట్ అక్టోబర్ 24(జనం సాక్షి)**లింగంపేట మండలంలోని పరుమళ్ళ గ్రామానికి చెందిన లెగ్గల రాజుకు శనివారం సిఐఎస్ఐ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో 10వ సారి రక్తదానం చేసిన లేగ్గేల రాజుకు ప్రత్యేక అభినందనలు.. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల (సస్మరణ వారోత్సవాల) సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి లేగ్గేల రాజు 10వ సారి రక్తదానం చేశారు.పదిసార్లు రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్న లేగ్గేల రాజును జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తమ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ సంజీవరెడ్డి కూడా ఆయనను అభినందించారు...ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి సి.ఐ రాజశేఖర్ రెడ్డి, లింగంపేట్ ఎస్సై దీపక్ కుమార్ లు లేగ్గేల రాజుకు ప్రశంసా పత్రాన్ని అందజేసి, ఆయన చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు..ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం ఎంతో అభినందనీయమని అన్నారు.

# పంచాయితీ సెక్రటరీ మృతికి నివాళులు



**రామగిరి జనం సాక్షి అక్టోబర్ 24:**రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన శనిగరపు జైపాల్ పార్థివ దేహానికి శనివారం పలువురు నివాళులు అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు మంథని మండలం సూరయ్యపల్లె పంచాయితీ సెక్రటరీ గా విధులు నిర్వహిస్తున్నారు. ముత్తారం మండలం ఓడేడు వాగు వద్ద ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందారు. మృతుడి స్వగ్రామమైన రత్నాపూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు, రామగిరి ఎఎస్ఐ ఈదునూరి స్వామి, రత్నాపూర్ సెక్రటరీ గంగుల సంతోష్, మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, నాయకులు బొంగరాల రవి, వేగోళపు మల్లయ్య, కండె పోషం, బండారి సదానందం, ఎరుకల బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



**మల్యాల అక్టోబర్ 24 (జనం సాక్షి)**తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నరసింగరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ అధికారులు అర్చకులు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చకులు సిబ్బంది ఉన్నారు.

# ఎల్ నినో నుండి మనల్ని మనమే రక్షించుకోవాలి

### ఏఎంసి చైర్మన్ చేలుకల తిరుపతి



**రుద్రంగి అక్టోబర్ 24 (జనం సాక్షి)**రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం శనివారం మండల ప్రత్యేక అధికారి సంపత్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి హాజరయ్యారు..ఈ సమావేశంలో సనుగుల సొసైటీ చైర్మన్ ఎగోలపు శ్రీనివాస్,తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అధికారులు ఆయా శాఖలపై నివేదిక సమర్పించారు.మండల అభివృద్ధి, రైతు సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

# రబీ సిజన్లో వేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి రాజశేఖర్

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 24, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలో వచ్చే రబీ సిజన్లో చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తెలిపారు. మొదటిసారిగా మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో పంటలపై అవగాహన కల్పించడానికి గ్రామ సభ నిర్వహిస్తున్నామని, ఇట్టి గ్రామసభలలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారులు కోరారు. ప్రస్తుతం ఎల్‌నినో ఎఫెక్ట్‌తో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వచ్చే రబీ సీజన్లో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పెసర, రాగులు, సజ్జలు వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఆరుతడి పంటలపై మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామాల వారిగా గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పాపూర్ గ్రామసర్పంచ్ ఎల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఏఈఓలు అనూష, ముకుంద్, బొప్పాపూర్ గ్రామరైతులు పాల్గొన్నారు.

# విఠల్ కుటుంబానికి తప్పని ఆర్థిక సంస్థల ఒత్తిళ్లు!

- **రుణ వాయిదాల చెల్లింపునకు ఒత్తిడి చేస్తున్నారని బాధితుల ఆవేదన**
- **టీఆర్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఖాసింను కలిసిన కుటుంబ సభ్యులు**



**బాన్సువాడ అక్టోబర్ 24 (జనం సాక్షి)**బాన్సువాడ: కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లికి చెందిన పిట్లం విఠల్ మృతితో విషాదంలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సంస్థల నుంచి మళ్లీ ఒత్తిళ్లు ఎదురవుతున్నాయని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విఠల్ మరణించి నెలన్నర రోజులు గడిచినా తమకు ఇబ్బందులు తప్పడం లేదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.విఠల్ తీసుకున్న రుణానికి సంబంధించిన నెలవారీ వాయిదాలు చెల్లించాలంటూ గత రెండు రోజులుగా ఆర్థిక సంస్థల సిబ్బంది తమపై ఒత్తిడి తెస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటిని ఖాళీ చేయాలని కూడా చెబుతున్నారని విఠల్ భార్య అనురాధ కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న తమను ఇలా ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలోనూ ఆర్థిక సంస్థల వేధింపుల కారణంగానే విఠల్ బలవన్మరణానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో తీవ్ర విషాదంలో కూరుకుపోయిన కుటుంబానికి ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ నేపథ్యంలో గురువారం బాన్సువాడ పట్టణంలో టీఆర్పీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఖాసింను బాధిత కుటుంబ సభ్యులు కలిసి తమ సమస్యలను వివరించారు. తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: ఖాసింవిఠల్ కుటుంబానికి అండగా ఉంటామని టీఆర్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఖాసిం హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని తమ నాయకుడు తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని మీడియాకు తెలిపారు.కాగా, కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలపై సంబంధిత ఆర్థిక సంస్థల వివరణ తెలియాల్సి ఉంది. ఈ వ్యవహారంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# నీటిని పొదుపుగా వాడాలి  జలసిరి కింద నీటి గుంతలు తప్పనిసరి



**లింగంపేట్ అక్టోబర్ 24(జనం సాక్షి)**గ్రామాల్లో ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని జలసిరి ద్వారా ఇంటింటికి ఇంకుడు గుంతలు తప్పనిసరిగా తవ్వించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం లింగంపేట మండలంలోని కొండాపూర్ , ముంబాజిపేట, భవానిపేట్, జల్దిపల్లి గ్రామాలలో ఆయన సందర్శించారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం రానున్న రోజుల్లో ఏదైనా ఎలినో ప్రభావంతో నీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో నీటి తొట్టెలు పశు వులకు దాహం తీర్చడానికి వాడుకోవాలని అదేవిధంగా గ్రామస్తులు వంట పాత్రలను ఇతరదరవస్తులను శుభ్రం చేసుకోవడానికి ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి తొట్టిలను ఆయన పరిశీలించారు నీతి తొట్టిల్లో వారం వారం వాటిని బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయాలని గ్రామ సర్పంచ్లకు కార్యదర్శిలకు సూచించారు. మీరు నిల్వ ఉన్న అట్లయితే నీతిలో పురుగుల ద్వారా దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. రోజువారీగా నీటి తోటిలను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.గ్రామాల్లో ఇంటింటికి ఇంకుడు గుంతను ఆ రాంజీ ఉపాధి కింద తగ్గించుకోవాలన్నారు. నీతి కొంత ద్వారా నీరు వృధా కాకుండా ఉంటాయన్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీలకు పనులు కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు.వయా గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. జల్లిపల్లి గ్రామంలో మహిళా సంఘ భవనం నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ తెగుళ్ల సంగీత రమేష్ మొదటిసారిగా ఎంపీడీవో గ్రామ పంచాయతీకి రావడంతో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు పకడ్బందీగా నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఇందిరమైనలు ఏ దశలో నిర్మాణం కొనసాగుతున్నయో పరిశీలించారు అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీలను తీర్చిదిద్దుకునే బాధ్యత సర్పంచులు పాల్గొన సభ్యులపైనే ఆధారపడింది అన్నారు. ఈయన వెంట సర్పంచులు నర్సింలు, సురేందర్, కాశిరాం, సంగీత రమేష్, ఎంపీ ఓ మలహరి కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# కారు బోల్తా గుండె పోటుతో బిఆర్ఎస్ నేత పి.టి. స్వామి మృతి



**గోదావరిఖని, జనంసాక్షి:**పాలకుర్తి మండలం బసంత్ నగర్ లో జరిగిన ప్రమాదంలో గోదావరిఖని పట్టణం కు చెందిన పి టి స్వామి మృతి చెందారు. పి టి స్వామి పెద్దపల్లి నుండి గోదావరిఖని కి వస్తున్న తరుణంలో ప్రయాణిస్తున్న కారు బసంత్ నగర్ దగ్గర బోల్తా పడింది. దాంతో  అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. చికిత్స పొందుతున్న తరుణంలో గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు డాక్టర్ లు తెలిపారు.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కి అనుచరుడుగా ఉంటూ అంచలంచలుగా ఆయన  బిఆర్ఎస్ పార్టీలో ఎదిగారు. ఇటీవల జరిగిన బిఆర్ఎస్, సింగరేణి కార్మిక గర్జనలో కూడా ఆయన పాల్గొని కేటీఆర్ ను కలిశారు. అకస్మాత్తుగా పి. టి స్వామి మృతి చెందడంతో పలువురు ఆవేదన చెందారు. పిటి స్వామి మృతి పట్ల బిజెపి సీనియర్ నాయకులు ఊర్ల లక్ష్మీనారాయణ ప్రగాఢ సానుభూతి, సంతాపం ప్రకటించారు. పిటి స్వామి లేని లోటు తీర్చలేనిదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## రాబోయే ఎల్ ని నో ప్రభావం నుంచి ప్రజానీకాన్ని ఆదుకోవడానికి చర్యలను వెంటనే చేపట్టాలి



**బోధన్, అక్టోబర్ 24 ( జనంసాక్షి ) :** రాబోయే ఎల్ నినో ప్రభావం నుంచి ప్రజానీకాన్ని ఆదుకోవడానికి చర్యలను వెంటనే చేపట్టాలనీ, క్షేత్రస్థాయిలో పరిశీలనలను చేసి వాటికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో ప్రభుత్వం పనులను వేగవంతంగా చేపట్టాలని సీపీఐ (ఎం-ఎల్ ) మాస్ లైన్ ప్రజాపంతా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం నాడు నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ మరియు అఖిలభారత ఐక్య రైతు సంఘంల ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్ లు మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం నుండి రైతాంగం,వ్యవసాయ కార్మికులు, నిరుపేద ప్రజానీకాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలను వెంటనే వేగవంతంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎల్ నేను ప్రభావం రాష్ట్రమంతటా ఒకే విధంగా లేదని కొన్ని జిల్లాలలో, మరికొన్ని మండలాలలో అత్యధిక ప్రభావం ఉండి నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నట్లు నిపుణులు, వ్యవసాయ అధికారుల పరిశీలనలో తెలుస్తున్నదని అయితే ప్రభుత్వం రబీ సీజన్లో వరి పంట ని సాగు చేయకూడదని నీటి కొరత, కరెంటు కొరత ఏర్పడుతుందని చెబుతూ ఆరుతడి పంటలను మాత్రమే వేసుకోవాలని సూచిస్తున్నప్పటికీ ఇప్పటికే కొన్ని జిల్లాలలో వరిని కోతలను మొదలు పెట్టారని అట్టిచోట వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలోకి వచ్చి రైతాంగానికి రబీ లో ఏ రకమైన ఆరుతడి పంటలను వేయాలో సూచనలు,సలహాలు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో రైతాంగము దుక్కి దున్నుకొని పంటలు వేయటానికి తేమ ఎత్తిపోయి రబి పంట సాగు చేయటానికి ఇబ్బందులు ఎదురవుతాయని అయోమయానికి గురవుతున్నారని, ఆందోళన చెందుతున్నారన్నారు.అందుకే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులు గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఏ పంటలు అనువైనవో శాస్త్రీయంగా పరిశీలించి అట్టి విత్తనాలను రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఈ కాలంలో వారి జీవనానికి అవసరమైన కుటుంబ మనుగడకు నిత్యావసర సరుకులను అందించి ఆదుకునే చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సాయిలు, ఊశయ్య, గంగాధర్, రమేష్, డి. నాగేశ్వర్,బాషా, సలీం, లక్ష్మణ్, రవి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యత

### హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి



**సైదాపూర్ అక్టోబర్ 24 (జనం సాక్షి)** హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఏర్పాటు దిశగా ఒక కీలకమైన సమాయత్త సమావేశం సైదాపూర్ మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అత్యంత విజయవంతంగా నిర్వహించారు. రాజ్యాంగ హక్కుల పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను సవివరంగా విశ్లేషించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎంతో దార్శనికతతో రచించిన పవిత్రమైన భారత రాజ్యాంగాన్ని, అందులోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యత దేశంలోని ప్రతి పౌరునిపై ఎంతైనా ఉందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే పునాదులపై నిర్మితమైన మన వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.దేశంలో సమానత్వాన్ని దెబ్బతీసి, మళ్లీ పాత కాలపు అసమానతలను పెంచి పోషించేందుకు జరుగుతున్న మనువాద కుట్రలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా పరిగణించాలని ఆయన హెచ్చరించారు. ఇలాంటి విచ్ఛిన్నకర కుట్రలను ప్రజలంతా ఏకమై, ఐకమత్యంతో ఎదుర్కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచాన్ని నిర్వీర్యం చేసే ఏ శక్తినైనా సామాజిక చైతన్యంతో తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 29.అక్టోబర్.2026 గురువారం రోజున భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక మండల కమిటీ ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలిపారు.ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ ద్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్, అక్కన్నపేట మండలం జేఏసీ ఇంచార్జి వేముల జగదీష్, పొడిశెట్టి వెంకట్రాజం,చాడ కొండల్ రెడ్డి, పైడిపల్లి రవీందర్,మిట్టపల్లి కిస్టయ్యా, గోపగొని నవీన్ కుమార్, మట్టెల రవీందర్, గాదెపాక అశోక్,బోరగల్ల రమేష్, రాయిశెట్టి చంద్రయ్యా, పొడిశెట్టి అజయ్,నార్ల వెంకటరాజం,భూక్య కిషన్ నాయక్, పరకాల రమేష్,జక్కోజు బిక్షపతి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ సమావేశానికి పలుచని హాజరు

### అధికారుల సమయపాలన కరువు.. కోరం లేక 45 నిమిషాలు ఆలస్యం



**సిరికొండ అక్టోబర్ 24(జనం సాక్షి ):**సిరికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారుల సమయపాలన లోపం, సర్పంచుల తక్కువ హాజరు స్పష్టంగా కనిపించాయి. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక అధికారి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం కోరం లేక 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలో మొత్తం 30 మంది సర్పంచులు ఉండగా, కేవలం 19 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కీలక సమావేశం ఆలస్యంగా ప్రారంభం కావడం, సర్పంచుల హాజరు పరిమితంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించాలిసమావేశంలో విద్యుత్, వైద్య సేవలు, తాగునీటి సరఫరా, ఎల్‌నినో ప్రభావం, పంచాయతీల ఆదాయ వనరులు, రెవెన్యూ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవీందర్ రావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి అవసరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యంగ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి ప్రకాష్ సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సేవలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి ప్రకాష్,ఎంపీడీవో రఫీ అహమ్మద్, తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీవో తారాచంద్, ఏవో నర్సయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

## టీజీపీఎస్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించిన పోలీస్ కమిషనర్



**రామగిరి జనం సాక్షి అక్టోబర్ 24:**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరిలో ఏర్పాటు చేసిన టీజీపీఎస్ పరీక్షా కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో చేపట్టిన భద్రతా చర్యలు,పోలీస్ బందోబస్తు, పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లను కమిషనర్ సమీక్షించారు.పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.

## 15వ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### మంత్రి శ్రీధర్ బాబుకు బత్తిని శ్రీనివాస్ వినతి



**యైటింక్లైన్ కాలనీ, (జనంసాక్షి)**అక్టోబర్ 24: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎంపీటీసీ బత్తిని శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.15వ డివిజన్‌లో ఏళ్లుగా నివసిస్తున్న పేదలకు జీవో నంబర్ 76 ప్రకారం ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, సింగరేణికి చెందిన ఒక ఎకరం భూమిలో 50 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని చిన్న వ్యాపారులకు సంబంధించిన షాపులను క్రమబద్ధీకరించి వారికి న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.కె.కె. నగర్, కుమార్ స్వామి నగర్ ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వెంకట్రావుపల్లి తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. పోతన కాలనీ నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే 14, 15వ డివిజన్ల ప్రజలతో పాటు సింగరేణి కార్మికులు, విద్యార్థులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని వివరించారు.దీనితో పాటు క్రీడా మైదానం అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ జిమ్ ఏర్పాటు, కె.కె. నగర్ బంగ్లాస్ మధ్య పార్కు నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు, ఎల్‌ఈడీ వీధి దీపాల అమరిక, వైకుంఠధామం నిర్మాణం వంటి పనులు చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నేపథ్యంలో డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని బత్తిని శ్రీనివాస్ కోరారు. ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి, పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేశారు.

## నేత్రపర్వంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

### భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు.. హనుమంత సేవపై స్వామివారి ఊరేగింపు



**గంభీరావుపేట అక్టోబర్ 24 జనం సాక్షి ;**రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని శ్రీ హరిహర దేవస్థానం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు, రామాచారి సప్తగిరి, రామాచారి, సుధాకర్ శర్మ, పండితులతోమంత్రోచ్చారణల మధ్య కనులపండువగా నిర్వహించారు.కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మంగళహారతులు సమర్పించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. కల్యాణోత్సవం అనంతరం స్వామివారిని హనుమంత సేవపై ఊరేగించగా భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పిట్ల ఎల్లయ్య,ఆలయ కమిటీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన్ జోగు సురేష్, పాలకవర్గం, మాజీ బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు , దయాకర్రావు,ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యలపై చర్చ



- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల మార్పిడిపై దృష్టి సారించాలి
- ప్రత్యేక అధికారి హనుమంతు నాయక్
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెంచాలి: దమ్మన్నపేట సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి
- మోటార్ల మరమ్మతులకు సహకరించాలి: సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్

**గంభీరావుపేట, అక్టోబర్ 24, జనంసాక్షి :** గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజేందర్ ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి హనుమంతు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ గ్రామాల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా దమ్మన్నపేట సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేందుకు అవసరమైన ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని అధికారులను కోరారు. సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరా మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మోటార్ల మరమ్మతులకు అవసరమైన నిధులు, సహకారం అందించాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి హనుమంతు నాయక్, ఎంపీడీవో రాజేందర్, ఏవో సలావుద్దీన్ మాట్లాడుతూ రాబోయే ఎనిమిది నెలల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి లభ్యతకు అనుగుణంగా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తాగునీటి అవసరాలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలు, తాగునీటి సరఫరా, రైతుల ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంకటి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన లింగంపేట్ మండల టిడిపి అధ్యక్షుడు



**లింగంపేట్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్రావును శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భీమ్రావు హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు మండలంలోనీ నిరుపేదలు చాలామంది ఉన్నారని వాళ్ళందరికీ పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెల్లారు దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు కచ్చితంగా రావాలని అన్నారు అభివృద్ధికి సహకరిస్తామని ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేతో అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసలైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఎన్నికలప్పుడే పార్టీలని ఆ తర్వాత అభివృద్ధి వైపే అందరూ సహకరించాలని ముందడుగు వేయాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అన్ని పేదలకు అందేలా చూడాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యేకు టిడిపి మండల అధ్యక్షుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

### గోపి యాదవ్‌కు తుంబూరు దయాకర్ రెడ్డి అభినందనలు



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ, యువత సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు. పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన రెబ్బగొండ్ల గోపి యాదవ్ శనివారం దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గోపి యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఆశయాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ యువతకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిరణ్, ఎదులాపురం మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ నవీన్, కౌన్సిలర్ నవీన్, మున్సిపాలిటీ బీసీ సెల్ అధ్యక్షుడు వెంపటి రవి, 29వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు మిర్యాల నరుణ్ తేజ్, నాయకులు అక్కినేపల్లి దేవయ్య చారి, ఎన్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు పొత్తులు గుర్తుకొస్తున్నాయి

### సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దంతాల బాలరాజు



**తిరుమలాయపాలెం అక్టోబర్ 24( జనం సాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎన్నికల సమయంలో సీపీఐతో పొత్తుల కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఎన్నికల అనంతరం సీపీఐ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో వివక్ష చూపుతోందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దంతాల బాలరాజు ఆరోపించారు. శనివారం తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్న వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే ధోరణి కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో సీపీఐతో పొత్తులు, మిత్రధర్మం గుర్తుకొచ్చే కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల అనంతరం సీపీఐ కార్యకర్తల సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. మిత్రపక్షాల కార్యకర్తల పట్ల వివక్ష చూపకుండా, అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అందజేయాలని దంతాల బాలరాజు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇళ్లులేని పేద కుటుంబాలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, నిరుపేద కార్మికులు అనేక మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మిత్రపక్షాల కార్యకర్తలను విస్మరించడం, వారి సమస్యలను పట్టించుకోకపోవడం రాజకీయ నైతికతకు విరుద్ధమని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో చోటుచేసుకుంటున్న అన్యాయంపై సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో ప్రజలను సమీకరించి పోరాటం చేపడతామని దంతాల బాలరాజు హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్ష నిర్వహించి, పార్టీ వివక్షకు తావులేకుండా అర్హత ఆధారంగా ఇళ్లను కేటాయించడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆయన కోరారు.

# అక్టోబర్ 26న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహా ధర్నా

### రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య పిలుపు



**మర్రిగూడ అక్టోబర్ 24 జనం సాక్షి)**

హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద అక్టోబర్ 26న సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహా ధర్నాను జయప్రదం చేయాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, పీఆర్‌సీ ప్రయోజనాలు వర్తింపజేయడం తదితర డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏళ్ల తరబడి వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సేవలందిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 26న ఇందిరా పార్కు వద్ద జరిగే మహా ధర్నాకు రాష్ట్రంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరి యాదయ్య కోరారు

# మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎం.డి. జమాల్

**ఇల్లంతకుంట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహమ్మద్ జమాల్‌ను మరోసారి నియమించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని ఇల్లంతకుంట మండల కేంద్రంలో అందజేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ జమాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా ఇల్లంతకుంట టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఫహీంను నియమించి, ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన పీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర మైనార్టీ చైర్మన్ ఇర్ఫాన్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, రాజన్న సిరిసిల్ల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటికి మహమ్మద్ జమాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

